# ఓ ప్రామాణిక గ్రంథంగా శ్రీ తూళ్ల దేవేందర్ గౌడ్

# ‘విజయ తెలంగాణ’

మాజీ హోంమంత్రి, మాజీ రాజ్యసభ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించిన శ్రీ తూళ్ల దేవేందర్ గౌడ్ తాజా రచన ‘విజయ తెలంగాణ’.

ఈ పుస్తకంలో రచయిత శ్రీ టి. దేవేందర్ గౌడ్ తెలంగాణ ప్రాంతానికి సంబంధించిన అనేక చారిత్రక అంశాలను, ఈ ప్రాంతానికి ఉన్న ప్రాధాన్యతను వివరించారు. తెలంగాణను కేంద్రంగా చేసుకొని కొందరు రాజులు దక్షిణ భారతదేశ ప్రాంతాన్ని పాలించిన వాస్తవాన్ని ప్రస్తావించారు. ఆ తర్వాత నిజాం పాలనలో సాగిన దారుణాలు, వాటికి వ్యతిరేకంగా సాగిన మహోన్నత తెలంగాణ సాయుధ పోరాటాన్ని వివరించారు.

భారతదేశ స్వాతంత్రోద్యమం తర్వాత దాదాపు ఏడాదికి తెలంగాణ విలీనం జరగడం, తదుపరి తెలంగాణ ప్రజల మనోభీష్టానికి వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ అవతరణ జరగడం, ఆ సమయంలో కుదుర్చుకొన్న ఒప్పందాల ఉల్లంఘన, ముల్కీ ఉద్యమం, ఆ తర్వాత తెలంగాణ రాష్ట్రం కోసం సాగిన తొలి ఉద్యమం, ఆ సమయంలో తన జ్ఞాపకాల్ని ఈ పుస్తకంలో వివరించారు.

తన రాజకీయ రంగ ప్రవేశం తర్వాత రంగారెడ్డి జడ్పీ చైర్మన్‌గా తెలంగాణ ప్రాంతానికి చేసిన అభివృద్ధి పనులు, ఆ తర్వాత 3 పర్యాయాలు ఎమ్మెల్యేగా, 10 ఏళ్లు మంత్రిగా పని చేసిన సందర్భంలో చోటు చేసుకొన్న రాజకీయ పరిణామాల్ని, తన గోదావరి జలసాధన యాత్ర, ప్రజల ఆంకాక్షల మేరకు టీడీపీ నుంచి బయటకు వచ్చి సొంత పార్టీ పెట్టడం, ఆ తర్వాత తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు జాతీయ స్థాయిలో వివిధ రాజకీయ పార్టీల మద్దతు కూడగట్టడానికి చేసిన కృషిని వివరించారు. రాజ్యసభ సభ్యునిగా సభలో తెలంగాణ అంశాన్ని ప్రస్తావించిన సంఘటనలతోపాటు వివిధ ప్రజా సంఘాలు, పార్టీలు, వ్యక్తులు ఏవిధంగా తెలంగాణ మలి ఉద్యమంలో పాల్గొన్న వివరాలు పొందుపరిచారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా సాకారం అయిన క్రమాన్ని వివరించారు. చివర్లో భవిష్యత్ తెలంగాణ ఏవిధంగా ఉండాలో కూడా తన అభిప్రాయాన్ని వ్యక్తీకరించారు.

సరళమైన భాషలో, ఎంతో విలువైన సమాచారాన్ని, చాలామందికి తెలియని పలు అంశాల్ని ఆసక్తికరంగా రచయిత శ్రీ టి.దేవేందర్ గౌడ్ తన ‘విజయ తెలంగాణ’ గ్రంథంలో రాశారు.